క్లుప్తంగా...

ఇంద్రసేనారెడ్డిని కలిసిన బీజేపీ మైనార్టీ నేతలు



చార్మినార్: త్రిపుర గవర్నర్‌గా నియమితులైన నల్లు ఇంద్రసేనారెడ్డిని పాతబస్తీ దారుషిఫాకు చెందిన బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి, సీనియర్ మైనార్టీ నాయకుడు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, నాయకులు గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.

సన్మానం



అబిడ్స్: త్రిపుర రాష్ట్ర నూతన గవర్నర్‌గా నియమితులైన ఎన్.ఇంద్రసేనారెడ్డిని ఘనంగా సత్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జ్ డి.గోపాల్‌జీ, సీనియర్ నాయకులు కె.కృష్ణారావు, డి.శేఖర్ ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గోపాల్‌జీ మాట్లాడుతూ.. రాష్ట్రంతో పాటు దేశ నలుమూలలా రాబోయేది బీజేపీ గవర్నమెంట్ అని పేర్కొన్నారు.

బతుకమ్మ పోటీలు



జియాగూడ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ సంబరాలు వేదికగా నిలుస్తాయని కార్వాన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. గురువారం జియాగూడ భీమ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో కార్వాన్ బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో బతుకమ్మ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా సుమారు 15 బతుకమ్మ బృందాలు పోటీల్లో పాల్గొనగా గెలుపొందిన వారికి మెమొంటోలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకురాళ్లు సంగీత, అనిత, చిరురాజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌లపై స్పెషల్ డ్రైవ్



గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లను ఏ మాత్రం సహించమని టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో టోలిచౌకీ, షేక్‌పేట్ నాలా తదితర ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్‌లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీమార్ట్ వద్ద అక్రమంగా పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను ట్రాఫిక్ వాహనాలలో ఎక్కించి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన యూనియన్ ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్: టీఆర్‌వీకేఎస్ యూనియన్ సౌత్ సర్కిల్ 3, 8, 9 డివిజన్లలో ఎన్నికలు నిర్వహించడం జరిగిందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ప్రతినిధి జాన్సన్ తెలిపారు. సీ–9 బేగంబజార్ డివిజన్ అధ్యక్షురాలిగా షాహిదాఫాతిమా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేందర్, ఉపాధ్యక్షులుగా సురేష్ ప్రసాద్, బాబురావు, డివిజన్ కార్యదర్శిగా షేక్ మాజీద్, సహ ప్రధాన కార్యదర్శిగా పాషా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆజం, డివిజన్ కోశాధికారిగా నరేందర్ ఎన్నికైనట్లు తెలిపారు. యూనియన్ నాయకులు ధినేష్ కుమార్, బాబురావు, శైలేష్ తివారి పాల్గొన్నారు.

ఒత్తిడిని తగ్గించే శక్తి కళలకు ఉంది

విజయనగర్‌కాలనీ: ఒత్తిడిని తగ్గించే శక్తి కళలకు ఉందని పలువురు కళాకారులు పేర్కొన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన గ్రూప్ పెయింటింగ్ షోకు విశేష స్పందన లభించింది. పెయింటింగ్ కళాకారులు వెంకటేశ్వర్లు, గుర్రం మల్లేశం, కృష్ణారెడ్డి, సామ కాంతారెడ్డి, కిషన్ దురిశెట్టి కుంచెల నుంచి క్యాన్వాస్‌పై జాలువారిన కళాఖండాలు ఆకట్టుకుంటున్నాయి. వారు మాట్లాడుతూ..పెయింటింగ్ విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని సినిమా, టీవీ, ప్రింట్, ఎలక్ట్రానిక్ రంగాలలో అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు.



పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కళాకారులు

మహాలక్ష్మీ నమోస్తుతే..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన గురువారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. – అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



రహింపురాలో.. ఆశీష్‌కుమార్ యాదవ్, పరమేశ్వరీ సింగ్



గుడిమల్కాపూర్‌లో లలితాదేవిగా దుర్గామాత



తుల్జాభవానీ మందిరంలో.. ఎమ్మెల్సీ ప్రభాకర్, మిత్రకృష్ణ, పరమేశ్వర్



సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయంలో..



మహాలక్ష్మీ అలంకరణలో మీరాలంమండి అమ్మవారు



కనక దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కేఎస్.ఆనంద్‌రావు



చండీహోమంలో పాల్గొన్న రమేష్ దంపతులు



స్కందమాతగా లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారు



మహాచండీ రూపంలో రాఘవేంద్ర స్వామి నగర్ దుర్గామాత



క్రాంతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



కేఎస్.నగర్‌లో శివకుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం



గర్బా దాండియా వేడుకలను ప్రారంభిస్తున్న గోవింద్‌రాఠి, సత్తేందర్



జాంబాగ్ దుర్గామాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ..



గోల్కొండ బంజారా దర్వాజ వద్ద..

నిరంతరం ప్రజా సేవలో మజ్లిస్ పార్టీ



గోల్కొండ: మజ్లిస్ పార్టీ నిరంతరం ప్రజా సేవాలోనే ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం గోల్కొండ మిర్జా గార్డెన్‌లో జరిగిన మజ్లిస్ విస్తృత సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీలో పని చేసే కార్యకర్తలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. మజ్లిస్ ఏరియా కమిటీలలో అత్యధికంగా యువకులే ఉంటారని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సమస్యలను మజ్లిస్ ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తేవడం ఏరియా కమిటీలదే బాధ్యత అని అన్నారు. ఆలయాలతో పాటు మజీదుల అభివృద్ధికి కూడా తమ పార్టీ కృషి చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు పాషాభాయ్, బదరుద్దీన్, వజీఉజ్జమ, షకీల్ ఆలీఖాన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

గోల్కొండ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. గురువారం కార్వాన్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతితో బీఆర్‌ఎస్ పార్టీ నిండా మునిగిందన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు బీఆర్‌ఎస్ పాలనలో ఉపాధి లభించక నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారని ఆయన అన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధన కాంగ్రెస్ పార్టీ వల్లే సాధ్యమైందని అయితే సీఎం కేసీఆర్ మాత్రం తనవల్లే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని డబ్బాలు కొట్టుకుంటున్నారని ఆయన అన్నారు. నేడు కాంగ్రెస్ పవనాలు తెలంగాణలో జోరుగా వీస్తున్నాయని వివరించారు. అదే విధంగా బీజేపీకి అభ్యర్థులే దొరకడం లేదని ఆయన ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ నాయకులు ప్రేమ్‌కిషోర్, రామ్‌కుమార్, చంటిబాబు, ఆకుల చంద్రశేఖర్, గిరి, జి.కిషన్, హబీబ్ తదితరులున్నారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కార్వాన్‌లోని కట్ట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాజీవ్‌గాంధీ సద్భావన యాత్రకు తరలివెళ్లారు.



కార్వాన్‌లో జరిగిన కాంగ్రెస్ నాయకుల సమావేశం

'కార్వాన్ కాంగ్రెస్ టికెట్‌ను రేవంత్‌రెడ్డి అమ్ముకున్నాడు'

అబిడ్స్: కార్వాన్ కాంగ్రెస్ టికెట్‌ను టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి అమ్ముకున్నారని కార్వాన్‌కు చెందిన గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాస్ ఆరోపించారు. కాంగ్రెస్ టికెట్‌ను 30 ఏళ్లకు పైగా కాంగ్రెస్‌లో పనిచేసిన వారిని పక్కకు పెట్టి టీడీపీ నుంచి వచ్చిన వారికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గురువారం గాంధీ భవన్‌కు తన అనుచరులతో కలిసి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్వాన్‌లో 30, 40 ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఉన్నవారికి టికెట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. రూ.50 వేలు దరఖాస్తు వెంబడి రేవంత్‌రెడ్డి తీసుకోవడం అక్రమం అన్నారు. వెంటనే టికెట్ ఇవ్వనివారికి రూ.50 వేలను చెల్లించాలని, లేనిచో న్యాయస్థానానికి వెళ్లి పోరాటం చేస్తామన్నారు.



శ్రీనివాస్

సమయపాలన పాటించని పాన్‌షాపు నిర్వాహకుడికి జైలు

డబీర్‌పురా: నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు పాన్‌షాప్ నిర్వహిస్తున్న వ్యక్తికి నాంపల్లి 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ టీఆర్.పద్మజ 2 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లికి చెందిన మహ్మద్ అహాద్ ఫైసల్ ఖాన్ (23) మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పాన్‌షాపును నిర్వహిస్తున్నాడు. ఫైసల్ ఖాన్ తన పాన్‌షాపును అర్ధరాత్రి దాటిన అనంతరం కూడా నిర్వహిస్తున్నాడు. దీంతో ఫైసల్ ఖాన్‌పై పోలీసులు కేసు నమోదు చేసుకొని గురువారం కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఫైసల్ ఖాన్‌కు 2 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన అవసరం

నాంపల్లి: మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గర్భసంచి ప్రాధాన్యతపై విస్తృత స్థాయిలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పలువురు వైద్య నిపుణులు సూచించారు. మోనోపాస్ దశలో మహిళల మానసిక శారీరక సమస్యలు గర్భసంచి ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో బుధవారం రాత్రి ఆయుర్వేదిక్ మోనోపాజల్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఏఎంఎస్ఐ) జాతీయ స్థాయి సదస్సు ప్రారంభోత్సవ వేడుకలు జరిగాయి. కిమ్స్ మహిళా రోగుల వైద్య విభాగం అధిపతి డాక్టర్ త్రిపుర సుందరి, మల్లారెడ్డి వైద్య కళాశాల స్త్రీ వైద్య విభాగం అధిపతి డాక్టర్ హరి అనుపమ, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ చిలువేరు రవీందర్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మోనోపాజల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్.కె.ఆర్, ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ గణేశ్వర్‌రెడ్డి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ నీలిమ ఆర్య, ఏఎంఎస్ఐ అధ్యక్షురాలు డాక్టర్ సుజాత గోనులతో పాటుగా పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు.



వైద్య నిపుణులకు వృత్తి నైపుణ్య శిక్షణ అవసరం

సుల్తాన్‌బజార్: నేటి సమాజంలో అకస్మాత్తుగా వ్యాపించే వ్యాధుల పట్ల వైద్య నిపుణులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఎంతో అవసరమని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి అన్నారు. ఆమె ఉస్మానియా మెడికల్ కళాశాలలో మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎంఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు పరస్పర చర్చలతో పలు వైద్య కళాశాల వైద్య నిపుణులతో గ్రూప్ డిస్కషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూణే నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి చెందిన సైంటిస్ట్ డాక్టర్ బాబాసాహెబ్ విశ్వనాథ్, తిరుపతి ఎస్వీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణమూర్తి, ఉస్మానియా మెడికల్ కళాశాల మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ బీఎం.శంకర్, వెంకటేష్, వీడీఆర్‌ఎల్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ సుధారాణి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ పావనీ, హరిత, సునిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సుజాత మిష, సయ్యద్ అహ్మద్ పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళారెడ్డి

మైత్రి అండ్ పీస్ కమిటీలలో యువత భాగస్వామ్యం పెరగాలి



మైత్రి కమిటీ సభ్యులతో కమిటీ అధ్యక్షుడు ఆబిద్

గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీలలో యువత భాగస్వామ్యం మరింత పెరగాలని గోల్కొండ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు ఆబిద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా గోల్కొండలో పీస్ అండ్ మైత్రి కమిటీ క్రియాశీలకంగా ఉందన్నారు. స్థానిక పండుగలు, ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా సహకరిస్తున్నారన్నారు. కమిటీల పనితీరును గుర్తించిన నగర పోలీస్ కమిషనర్ ప్రతియేటా పురస్కారాలు ఇస్తున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి ఇలియాస్ ఆలీ, పరమానందం, ఆజామ్‌ఖాన్, చాంద్‌బాయ్ తదితరులున్నారు.

రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక దినోత్సవం

దూద్‌బౌలి: శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశాన్ని అభివృద్ధి చేసిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చార్మినార్ వద్ద రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక కమిటీ చైర్మన్ జి.నిరంజన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ స్థూపం వద్ద జెండాను ఆవిష్కరించిన అనంతరం రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తున్నారన్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ మంత్రి సంజీవరెడ్డికి రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. నాయకురాలు దీపా దాస్ మున్సీ, నాయకులు హనుమంత్ రావు, కోదండరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కాశమోనీ శ్యాం రావు ముదిరాజ్, కన్నయ్య లాల్, రాజేష్ కుమార్, రవిరాజ్, బోయ నరేష్ పాల్గొన్నారు.



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

గాంధీభవన్‌లో గోషామహల్ కాంగ్రెస్ సీనియర్ నేతల ఆందోళన

అబిడ్స్: గోషామహల్ కాంగ్రెస్ టికెట్‌పై రచ్చ కొనసాగుతోంది. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన సునితారావుకు టికెట్ ఇవ్వడంతో గోషామహల్ నియోజకవర్గంలోని టికెట్ కోసం ప్రయత్నించిన వారంతా గాంధీభవన్‌లో ఆందోళన చేశారు. దివంగత నగర మాజీ మేయర్, గోషామహల్ మాజీ ఎమ్మెల్యే కుమారుడు వినయ్‌కుమార్ ముదిరాజ్, గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధీర్‌కుమార్ తివారి (గుల్లుమహారాజ్), కన్నయ్యలాల్ సాహు, నర్మద సింగ్, సంజయ్‌తో పాటు పలువురు నాయకులు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. గోషామహల్ కాంగ్రెస్ టికెట్‌ను సైఫాబాద్ వారికి ఎలా ఇస్తారని నినాదాలు చేశారు. వినయ్‌కుమార్ ముదిరాజ్, సుధీర్‌కుమార్ తివారి మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ కంచుకోట అయిన గోషామహల్‌లో ఏమీ తెలియని వారికి టికెట్ ఇచ్చి పరోక్షంగా ఇతర పార్టీలకు లబ్ధి చేకూర్చారని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన ఇష్టారాజ్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. పెద్ద ఎత్తున రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో గాంధీభవన్ మారుమ్రోగింది.



ఆందోళన చేస్తున్న వినయ్‌కుమార్ ముదిరాజ్, సుధీర్‌కుమార్ తివారి తదితరులు

కార్వాన్ మజ్లిస్ సిట్టింగ్‌కు అధిష్ఠానం పచ్చజెండా?

గోల్కొండ: మజ్లిస్ అధిష్ఠానం కార్వాన్ సిట్టింగ్ ఎమ్మెల్యేకు పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది. 1999 నుంచి కార్వాన్ నియోజకవర్గంలో మజ్లిస్ అభ్యర్థులు గెలుస్తూ వస్తున్నారు. 1999 నుంచి మూడుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దివంగత అఫ్సర్‌ఖాన్ వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టారు. 2014, 2019 ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థిని మార్చి కౌసర్ మోహియుద్దీన్‌కు టికెట్ ఇచ్చింది. 2019 ఎన్నికల్లో అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే కౌసర్ సుమారు 48 వేల భారీ మెజార్టీతో విజయం సాధించి కార్వాన్‌లో మజ్లిస్‌ను పటిష్టత రీతిలో చేర్చారు. అయితే పలు సందర్భాల్లో ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మజ్లిస్ కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను మారుస్తామంటూ పరోక్షంగా హింట్ ఇచ్చారు. అయితే మజ్లిస్ పార్టీ ఎంతో బలంగా ఉన్న కార్వాన్ నియోజకవర్గంపై ఆయన పెదవి విప్పలేదు. అయితే ఎన్నికల ప్రకటన వెలువడకముందు నుంచే సిట్టింగ్ ఎమ్మెల్యే కౌసర్ చాపకింద నీరులా ఉధృతంగా పర్యటనలు చేస్తున్నారు. 15 రోజులుగా ఎంతో ఉత్సాహంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్తీలు, కాలనీల్లో పర్యటనలు చేస్తూ సిట్టింగ్ ఎమ్మెల్యే తనకు ఎదురు లేదని చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎక్కడ కూడా ఎన్నికల ప్రస్తావ తేవకపోవడం గమనార్హం. ఏదేమైనా ఈసారి మజ్లిస్ అధిష్ఠానం కార్వాన్ అభ్యర్థిని మార్చడం లేదన్నది మాత్రం స్పష్టంగా తెలుస్తోంది.

రేపు మాతా రాణికా విశాల్ జాగరణ్



బ్రోచర్ విడుదల చేస్తున్న సమితి ప్రతినిధులు

జియాగూడ: ఈనెల 21న ధూల్‌పేట్ నవరాత్రి ఉత్సవ సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో రహింపురాలోని అంబేద్కర్ భవన్ ప్లేగ్రౌండ్‌లో మాతా రాణికా విశాల్ జాగరణ్ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు సమితి చైర్మన్ ఎం.శ్రీధర్‌బాబు, అధ్యక్షుడు టి.జితేందర్ సింగ్, ప్రధాన ఆర్యదర్శి పిట్టల కృష్ణ, కోశాధికారి నిర్మేష్, సలహాదారులు ఎం.మహేష్, పి.రవీందర్‌సింగ్, టి.విపిన్‌రాజ్ సింగ్, వైస్ చైర్మన్ కె.సత్యనారాయణలు తెలిపారు. గురువారం జాగరణ బ్రోచర్‌ను రహింపురాలో విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..మాశక్తి యువ మండల్ భాగ్యనగర్ ద్వారా భజనమండలి ఉంటుందన్నారు. జాగరణ్‌లో వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాగరణ్ భజనలు కొనసాగుతాయని ఇందులో ప్రముఖ గాయకులు ఠాకూర్ రవిసింగ్, కోమల్ తివారి, ఎస్.రాజన్‌కుమార్, మౌంటీ నట్రాజన్ బృంద ఢిల్లీ వారితో వివిధ దేవతామూర్తుల వేషధారణలతో నృత్యాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు ఎం.సదానందం గుప్తా, పి.సచిన్‌రాజ్‌సింగ్, రోమి అరోరా, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో సత్తాచాటిన 'మెథడిస్ట్' విద్యార్థి

అబిడ్స్: రాష్ట్రస్థాయి 3వ టేబుల్ టెన్నిస్ ఫర్ లైఫ్ తెలంగాణ స్టేట్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 2023లో అబిడ్స్ మెథడిస్ట్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి త్రిశూల్ మెహరా విజయం సాధించారు. ఎల్బీస్టేడియంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో 19 ఏళ్ల కేటగిరిలో త్రిశూల్ మెహరా తన సత్తా చాటారు. వైటు టైగర్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో అశ్విన్‌కుమార్ జైస్వాల్ కోచ్ ద్వారా శిక్షణ పొందిన త్రిశూల్ మెహరా అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. విజయం సాధించిన త్రిశూల్ మెహరాను మెథడిస్ట్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కోడాలి కృష్ణారావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి సచ్చింద్రనాథ్‌లు అభినందనలు తెలిపారు.



త్రిశూల్ మెహరా

సునీల్‌శర్మకు అభినందనలు

అబిడ్స్: వాణిజ్యపన్నుల శాఖ, ఎక్సైజ్, ఎండోమెంట్ శాఖలకు నూతన స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించిన సునీల్‌శర్మను ఘనంగా సత్కరించారు. తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ కేంద్ర కార్యవర్గం అధ్యక్షుడు రావుల ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహ్మద్ రహ్మత్‌అలీ, కోశాధికారి దేవులపల్లి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు హరిప్రసాద్, ఉపాధ్యక్షులు మాల్యాల మధులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వాణిజ్యపన్నుల శాఖలో ఉన్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



సునీల్‌శర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రావుల ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మహ్మద్ రహ్మత్ అలీ